క్లుప్తంగా

వాసవీ మాతకు పూజలు



పూజ చేస్తున్న మహారాష్ట్ర భక్తులు

పెనుగొండ: మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన భక్తులు పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ శాంతి థాం అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గో పూజలు నిర్వహించారు. అనంతరం 102 రుషీ గోత్ర మందిరంలో మరకత శిల వాసవీ మాతకు దంపతుల పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. యాగశాలలో వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పశువులకు టీకాలు

యలమంచిలి: వర్షా కాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖర రెడ్డి అన్నారు. ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో బుధవారం ఆయన 31 ఆవులకు, 108 గేదెలకు వ్యాక్సిన్ వేశారు. ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని, పాడి రైతులంతా తమ పశువులకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం గురువారం నేరేడుమిల్లి గ్రామంలో నిర్వహిస్తామని తెలిపారు.

పోషకాహారం అందించాలి

పెనుమంట్ర: పిల్లలకు పోషకవిలువలతో కూడిన ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ వెంకట్ లక్ష్మి అన్నారు. బుధవారం మాముడూరు అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరు నెలల వరకు పిల్లలకు ఏ విధంగా పాలు పట్టాలి, నవజాత శిశువులు, రెండేళ్ల తక్కువ వయసున్న పిల్లలకు సరైన ఆహారం ఏ విధంగా అందించాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పథకాలు అందాలి

నరసాపురం: హాస్టల్ విద్యార్థులకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలని ఎస్సీ సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎన్‌వీ అరుణ కుమారి అన్నారు. బుధవారం వైఎన్ కళాశాలలో నరసాపురం, పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల్లోని కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఫలాలు అందుతున్నదీ లేనిదీ సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణ చేయాలని చెప్పారు. సమావేశంలో కళాశాలల యజమానులు, హాస్టల్ వార్డెన్స్ పాల్గొన్నారు.

పొదల తొలగింపు

పెనుగొండ: పెనుగొండలో విద్యుత్ తీగల కింద చిట్టడుల్లా పెరిగిపోయిన గుబురు పొదల తొలగించారు. ఇటీవల పొదలు, పొదులు విపరీతంగా పెరిగి పోవడంతో విద్యుత్ తీగల పైకి ఎగబాకి ప్రమాదభరితంగా మారాయి. గుబురు పొదలు రోడ్డుపైకి చేరడంతో వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో వీటి తొలగింపుకు శ్రీకారం చుట్టారు.

జాతీయ వికాస్ దినోత్సవం

పెనుగొండ: ప్రపంచానికి మార్గదర్శనం చేసే స్థాయికి భారత్ వికసిస్తుందని నవజ్యోతి యూత్ అసోషియేషన్ అధ్యక్షుడు చింతాకుల గోపాల కృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ మేరా యువభారత్ ఆదేశాల మేరకు నవజ్యోతి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పెనుగొండ విశ్వతేజ కళాశాలలో భారత ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ వికాస దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతీ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వరస్వామికి పూజలు

పాలకొల్లు సెంట్రల్: ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ వద్ద బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కుబేరస్వామి, దేశాలమ్మ, ముఖదారమ్మ ఆలయాల్లోనూ పూజలు చేయించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి కొండప్రసాద్, అల్లూరి పద్మవర్మ, చెరుకూరి శ్రీనివాసరావు, కబర్ది, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ జన్మదిన వేడుక

పెనుమంట్ర: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పెనుమంట్ర మండల బీజేపీ ఆధ్వర్యంలో మార్టేరు సెంటర్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేజీ ప్రసాద్‌రెడ్డి మండలపార్టీ అధ్యక్షులు గోపరాజు మారుతి కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

గురువులను గౌరవించాలి

పెనుగొండ: గురువుల పట్ల కృతజ్ఞతాభావం, గురువులను గౌరవించడం అనేది సమాజ గొప్ప తనానికి నిదర్శనంగా ఉంటుందని అపుస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జంగా బాలాజీ అన్నారు. బుధవారం అపుస్మా ఆచంట జోన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం–2025ను వైభవంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు అక్కినేని కృష్ణ కిషోర్, ఆచంట జోన్ అధ్యక్షుడు జీవీఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పుష్కర ఘాట్‌లు



అధ్వానంగా ఉన్న ప్రఖ్యాత వలంధర్‌రేవు



శిథిలావస్థలో కొండాలమ్మ ఘాట్



నిరుపయోగంగా మారిన అమరేశ్వర ఘాట్

నరసాపురం వశిష్ట గోదావరి బండ్ పొడువునా 2015 గోదావరి పుష్కరాల సమయంలో నిర్మించిన ఘాట్‌లు శిథిలావస్థకు చేరాయి. లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకు బుడ్డిగరేవు, అమరేశ్వరఘాట్, లలితాంభఘాట్, వలంధర్ రేవు, కొండాలమ్మ ఘాట్‌లను రూ.10 కోట్లతో అభివృద్ధి చేశారు. నాటి టీడీపీ హయాంలో ఈ పనుల్లో అవినీతి కారణంగా నాణ్యత కొరవడింది. అనంతరం పర్యవేక్షణ లేకపోవడంతో రేవులన్నీ శిథిలమయ్యాయి. - నరసాపురం



బాపూ ఘాట్ దుస్థితి

వెస్ట్ కుక్కిలేరును ఆధునికీకరించండి



నినాదాలు చేస్తున్న రైతులు

నరసాపురం రూరల్: నరసాపురం మండల పసలదీవి గ్రామంలో ఉన్న వెస్ట్ కుక్కిలేరు మురుగునీటి డ్రెయిన్‌ను తక్షణమే ఆధునికీకరించాలంటూ రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ముగురు డ్రెయిన్ పూడుకు పోవడంతో పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. దీంతో వందలాది ఎకరాల్లో సాగు చేయడం లేదని తెలిపారు. సమస్యను గతంలో పలుమార్లు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎన్నో ఏళ్లుగా కాలువలు పూడిక తీయకపోవడంతో పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయని వివరించారు. ఈ డ్రెయిన్‌ను ఆధునికీకరిస్తే రెండు పంటలూ సాగు చేసుకునే వీలుంటుందన్నారు. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలువ పూడిక పనులు చేపట్టాని రైతులు కోరారు. కార్యక్రమంలో కొట్టు సత్యనారాయణ, పులపర్తి శ్రీను, లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, జానకిరామ్, ఏసురాజు, కందులపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో మేలు



వడలిలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

పెనుగొండ: రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చునని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన అన్నారు. బుధవారం వడలిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక సహాయ సహకార సంఘం వద్ద సామూహిక ఎలుకల నివారణకు విషపు ఎరను పంపిణీ చేశారు. 150 కేజీల నూకలు, మూడు కేజీల వేరు శనగ నూనే, 3 కేజీల బ్రోమోడయోలిన్ మందును కలిపి రైతులకు అందించారు. కేజీ నూకలను 20 పొట్లాలుగా కట్టి ఎలుక బొరియల్లో పెట్టాలని సూచించారు. విషపు ఎరను ఎలుకలు మాత్రమే తింటాయని, ఇతర ఏ జీవులు తినవని తెలిపారు. రైతులు అందరూ సామూహిక నివారణకు తోడ్పాటు నందించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, డెప్యూటీ ఎంపీడీఓ పెనుగొండ సూర్యప్రకాష్, కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, ఉప్పలపాటి చంటి, అంగర వర ప్రసాద్, సొసైటీ చైర్మన్ కట్టా వెంకట రామకృష్ణ, నీటి సంఘ ఉపాధ్యక్షుడు సంకురాత్రి నరసింహారావులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం



పెనుగొండ సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: మహిళలు శక్తివంతంగా ఉంటే ఆరోగ్యవంతమైన కుటుంబాన్ని తయారు చేయగలుగుతారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహిళలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ యర్రా మాధురి, పెచ్చెట్టి బాబు, జివి, అల్లూరి పద్మవర్మ, చినిమిల్లి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.


లంకలకోడేరులో..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం నవ్యజీవన్ ఆధ్వర్యంలో సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించారు. 162 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 105 మందికి కంటి పరీక్షలు, 27 మందికి కళ్లజోళ్లు పడతాయని మరో 8 మందికి ఆపరేషన్లు చేయాల్సి ఉంటుందని గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల ధనలక్ష్మి, జిల్లా డీపీఎంఓ సీహెచ్ ధనలక్ష్మి, పెన్మెత్స సత్యనారాయణరాజు, నెక్కడి ఆదినారాయణ, పెన్మెత్స రామసూరి, డాక్టర్ జి.దినేష్, గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ సీహెచ్‌సీలో..

పెనుగొండ: ఆచంట, పెనుగొండల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలకు ఉచిత వైద్య, రక్త పరీక్షలు హిమోగ్లోబిన్ స్థాయి పరిశీలన చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పితాని వెంకట్, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డి.రాంబాబు, వైద్యులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



చిట్టవరంలో కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పేద, ఆర్థికంగా వెనుకబడిన మహిళల ఆర్థికాభివృద్ధికి తమ ట్రస్ట్ కృషి చేస్తుందని రాజ్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో దళిత నాయకుడు కాకిలేటి ఆనందకుమార్ (మధు) అధ్యక్షతన జరిగిన సభలో రాజ్‌కుమార్ మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గొంది, చిట్టవరం గ్రామాల్లోని 28 పేద మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాల్లోని రెండు వేలకు పైగా మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపీపీ మైలాబత్తుల సోని మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడి లక్ష్మణరావు, గ్రామ ప్రముఖులు చల్లా సత్యనారాయణ, కోళ్ల శ్రీనివాస్, కోపల్లి శ్రీనివాస్, రేవు ప్రభుదాస్, గ్రంధి శ్రీనివాస్, పైడికొండల కృష్ణ, వింజమూరి రాజబాబు, పాస్టర్ రాబిన్, గూటం జయబాబు, వర్ధనపు చంటి, రావి హూపర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



సిద్ధాంతంలో విశ్వ కర్మ గ్రామోత్సవం



విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న సంఘ సభ్యులు

పెనుగొండ: విశ్వకర్మ జయంతిని సిద్ధాంతంలో కామాక్షీ గాయత్రీ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. సిద్ధాంతం వీధుల్లో సాంప్రదాయ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. బొడ్డు నర్సింహామూర్తి కుమారులచే అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వింజరపు సూర్యభాస్కరరావు, కీశ్ల భద్రయ్య, బొడ్డు బ్రహ్మాజీ, కడియం చిట్టిబాబు, కీశ్ల వీర బ్రహ్మంలు పాల్గొన్నారు.

పెనుగొండలో..

కామాక్షీ దేవి ఆలయం వద్ద విశ్వ కర్మ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వకర్మకు అర్చనలు, అభిషేకాలు చేశారు. విశ్వ బ్రాహ్మణ సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అచ్చుగట్లపాలెంలో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ సాయి గాయత్రి ఆలయంలో శ్రీ మద్విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో పాలకొల్లు పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవ పూజలు చేశారు. పాలవలస దయానంద్ విద్యాసాగర్, లక్కోజు సురేష్, కడారి రామ్మోహన్, కొత్తుర్తి వీర మణికంఠ సాయి కుమార్, పట్నాల వెంకట సాయికుమార్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం పురవీధుల్లో మంగళవాయిద్యాలతో విశ్వకర్మ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. కొమ్మోజు మధుసూధనరావు జెండా ఆవిష్కరణ చేశారు. సంఘ అధ్యక్షుడు వింజరపు శంకరం, సెక్రటరీ గురజాపు శాస్త్రి, ట్రెజరర్ కర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు చాంబర్స్ కళాశాలలో జాబ్‌మేళా

పాలకొల్లు సెంట్రల్: చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ కేవీ నరసింహారావు తెలిపారు. ఆర్విక్స్ లాబరేటరీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు గల మహిళా అభ్యర్థినులు మాత్రమే అర్హులని, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ చేసి ఉండాలని తెలిపారు. నెలకు రూ.18 వేలు నుంచి రూ.20 వేలు వరకు జీతం ఉంటుందన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ కేవీ సీతారామరాజు, ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్టోబర్ 31 వరకు 'అంగీకార్'

పాలకొల్లు సెంట్రల్: పీఎంఏ వై 2.0 పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా పీఎంఏవై అర్బన్ ఆవాస్ దివస్ నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి తెలిపారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మెప్మా భవనంలో అంగీకార్ ప్రచార బ్రోచర్ విడుదల చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 31 వరకు అంగీకార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పీఎంఏవై 2.0 అర్బన్ పథకం వివరాలను లబ్ధిదారులకు తెలియజేస్తామని, ఈ పథకంలో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష కలిపి మొత్తం రూ. 2.50 లక్షలు ఉచితంగా ఇస్తుందన్నారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పీఎం సూర్యఘర్ మఫ్త్ బిజిలి యోజన ఉచిత విద్యుత్ పథకం, కేంద్రం అందించే ఇతర పథకాలను వివరిస్తామని చెప్పారు. టీపీఓ వీరబ్రహ్మం, సీఎంఎం రత్నాకర్, ఏఈ డి.రమేష్, సీఓలు సునేత్ర, రాధ, వీరభద్రరావు, సూరిబాబు పాల్గొన్నారు.

ప్రయాణికుల నిరసన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

పెనుమంట్ర: పెనుమంట్ర – వీరవాసరం రహదారిలోని పాలమూరు – నవుడూరు సెంటర్ మధ్య సుమారు 100 మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు చెరువులా మారిందని, ఐనా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తుంటే, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ బహుజన కులాల రాష్ట్ర నాయకుడు చింతపల్లి గురు ప్రసాద్, సీపీఎం జిల్లా నాయకుడు కేతా గోపాలన్ ఆధ్వర్యంలో బుధవారం నవుడూరు. పాలమూరు గ్రామస్తులు, పలువురు ప్రయాణికులు రోడ్డుపై వాహనాలు నిలిపి నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ గోపాలం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ మంత్రి రంగనాథరాజు రూ.రెండున్నర కోట్లు ఆర్ అండ్‌బీ నిధులు మంజూరు చేయించి పోలమూరు నుంచి కొంతమేర సిమెంట్, తారు రోడ్లు పనులు పూర్తి చేయించారని, నవుడూరు సమీపంలో సుమారు 100 మీటర్ల రోడ్డు ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా అధికారులు నిలిపివేశారని తెలిపారు. తక్షణమే మిగిలిన భాగాన్ని సిమెంట్ రోడ్డుగా నిర్మించి పాలమూరు నుంచి నవుడూరు సెంటర్ వరకు రోడ్డును ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలమూరు మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, కొటాల మధు, రాపాక ఆశీర్వాదం, తూటే సురేష్ ,తాడిపత్రి నరేంద్ర, పిల్లి రాజ్ కుమార్, పిల్లి శ్రీనివాస్, చిక్కాల సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితర నాయకులు ప్రయాణికులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: వందేళ్ల చరిత్ర ఉన్న పాలకొల్లు పురపాలక సంఘం పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం దురదృష్టమని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని అన్నారు. ఈ మేరకు బుధవారం నరసాపురం ఆర్డీఓ దాశి రాజుకు వినతిపత్రం అందించారు. పాలకొల్లు, పరిశర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కోరుకొండ సుబ్బారావు పాల్గొన్నారు.

సర్వేల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

పెనుగొండ: ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సచివాలయ సిబ్బంది బాధ్యతతో నిర్వహించాలని నరసాపురం డివిజనల్ అభివృద్ధి అధికారిణి జి.రాణి అన్నారు. బుధవారం ఆచంటలోని సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు, ఇతర కార్యక్రమాలు విధిగా చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది కొరత సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కృష్ణమోహన్, ఏఓ వి.పూర్ణబాబ్జి, డెప్యూటీ ఎంపీడీఓ బులి సూరన్న, సీనియర్ అసిస్టెంట్ నాగిరెడ్డి, నాగబాబులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నరసాపురం రూరల్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో భాగంగా మంజూరు చేసిన నిధులను మత్స్య సహ కార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం మొగల్తూరు మండలం పేరుపాలెం లైన్‌పల్లవపాలెంలో మత్స్యసహకార సంఘ భవనాన్ని నాయకర్ ప్రారంభించారు. అనంతరం పీఎం ఎంఎస్‌వైలో భాగంగా 15 మత్స్యసహకార సంఘాలను మొదటి విడతగా మంజూరైన నిధులు రూ .38 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు మైలా వసంత రావు, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎంపీపీ వాతాడి కనకరాజు, కొల్లాటి గోపీ కృష్ణ, వాతాడి ఉమ, వనమాల శ్రీను, పలువురు ఫిషరీస్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల సేవలో ముందుండాలి

నరసాపురం రూరల్: రైతులకు సేవలు అందించడంలో కో ఆపరేటివ్ సొసైటీలకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలు ముందుండాలని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) సంకు మురళీకృష్ణ అన్నారు. బుధవారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం సొసైటీ పాలకవర్గ అధ్యక్షుడిగా చాగంటి పార్థసారథి, సభ్యులుగా దొంగ రామలక్ష్మి, గుండు బోయిన సత్యనారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు. సభలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ పలువురు మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



బుడితి సుమన్

నరసాపురం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలల విషయంలో కూటమి నేతలు అబద్ధాలు చెప్పి ప్రజలకు అడ్డంగా దొరికిపోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బుడితి సుమన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను కచ్చితంగా వైఎస్సార్‌సీపీ అడ్డుకుంటుందన్నారు. పేదలకు సత్వరం నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలు తీసుకురాగా, నేటి కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందని అన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. జగన్ హయంలో ఎక్కడా మెడికల్ కళాశాలల పనులు ప్రారంభం కాలేదని కూటమి సర్కార్ మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. 10 కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభమైతే, ఇలా బొంకడం కూటమి నేతలకే చెల్లిందని సుమన్ వివరించారు.